ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్, ఎంఎస్ఎంఈ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో ఎంఎస్ఎంఈ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి ముఖ్యఅతిథిగా హాజరై ఎంఎస్ఎంఈలో అవకాశాలపై విశదీకరించారు. అదే విధంగా సీఎస్ఐఆర్ ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు ఎంఎస్ఎంఈలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అవకాశాలపై వివరించారు. అదే విధంగా సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ చీఫ్ మేనేజర్ కిరణ్‌కుమార్ ప్లాస్టిక్ రంగంలో ఎంఎస్ఎంఈ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించారు.

◆ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ రీజనల్ ఆఫీసర్ నటరాజ్ ప్యాకింగ్ రంగంలో అవకాశాలను కుప్లంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెంకట రామయ్య మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ అందిస్తున్న ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకుని ప్రారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ కుమార్, దళిత ఐక్యవేదిక అధ్యక్షులు మేకల నగేష్, మిక్కి తెలంగాణ ప్రధాన కార్యదర్శి బక్క నరసింహ, జేవీపీ ప్రగతినగర్ అధ్యక్షుడు శంకర్రావు, ఆటో కార్మికుల సంఘం నాయకులు సభ్యులు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, యువతి యువకులు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఈ సదస్సులో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి

కాలనీల అభివృద్ధిలో పూర్తి సహకారం అందిస్తా

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ ప్రజలు తనకు సంపూర్ణ మద్దతు తెలిపారని వారికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బాచుపల్లిలోని ఏబీఆర్ ప్రణవ్ ఆంటిలియా నూతన సంక్షేమ సంఘం సభ్యులు గురువారం వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల అభివృద్ధిలో తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.మహేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి. నాగేశ్వర్‌రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు స్థానిక సమస్యలపై వివేకానంద్‌ను కలిసి విన్నవించారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

ఘనంగా సైన్స్ ఫియస్టా ప్రారంభం

మెదడుకు పదును పెడితే భావితరాల నిపుణులవుతారు: డీఈఓ విజయకుమారి

చింతల్: మెదడుకు పదును పెడితే ప్రతి విద్యార్థి భావితరాల నిపుణులవుతారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారిణి ఐ.విజయ కుమారి అన్నారు. చింతల్ డివిజన్ పట్వారినగర్ నవ జ్యోతి పాఠశాలలో రెండు రోజుల పాటు జరగనున్న వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫియస్టా 2024) గురువారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను విద్యాశాఖ అధికారులు, ప్రతినిధులు, ఉపాధ్యాయులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ విజయకుమారి, ఎంఈఓ ఆంజనేయులు, స్కూల్ చైర్మన్ మలిరెడ్డి ఇందిరా రవీందర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్లు ఆదిత్య కృష్ణ, రూపాంజలి, గాంధీనగర్ హెచ్ఎం వెంకట రాములు, సంఘ సేవకులు కృష్ణారెడ్డి, మాధవ రెడ్డి ఎంఎల్ఓ రమేష్, ఎంఆర్పీ బాబుతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవజ్యోతి హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న డీఈఓ విజయకుమారి



కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి అని కార్మిక నేత చింతల నాగరాజు అన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామికవాడలో సాయినార్ కంపెనీలో బీఆర్ఎస్‌కేవీ జెండాను మార్చి ఐఎన్టీయూసీ జెండా ఎగరవేశారు. అనంతరం చింతల నాగరాజు మొన్న జరిగిన అసెంబ్లీ ఎలక్షన్ కన్నా ముందే కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. అందుకే ఐఎన్టీయూసీ జెండాను ఆవిష్కరించామని తెలిపారు. సాయినార్ కంపెనీలో వచ్చే ఏడాది అగ్రిమెంట్ ఉందని కాంగ్రెస్ ప్రభుత్వ సహాయంతో అగ్రిమెంట్ చేయిస్తానని కార్మికులకు నాగరాజు హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఎమ్మెస్ రాజు, రాంబాబు, శ్రీధర్, హరికృష్ణ, మురళి, ఈశ్వరయ్య, గోపాల్ రెడ్డి, శేషు, ఆనంద్, దేవా, యాదిరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.



ఐఎన్టీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న చింతల నాగరాజు



చెత్త వార్

- మా ఏరియాలో మీరు చెత్త సేకరించడమేంటంటూ ఇద్దరిపై దాడి
- గొడవను గమనించి వారిని నిలువరించిన స్థానికులు
- ఫోన్ మరికొందరిని పిలిపించి దాడి చేసిన సుధాకర్ అతడి బంధువులు
- ఇద్దరూ ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు తెలిపిన పోలీసులు



చికిత్స పొందుతున్న పరమేశ్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త వార్ చిలికి చిలికి గాలివానాల మారి ఏకంగా కత్తులతో దాడులు చేసుకునే స్థాయికి చేరింది. అలస్యంగా వెలుగులోకి వచ్చిన ఓ సంఘటన వివరాలు... ఇద్దరు చెత్త కార్మికులపై జరిగిన దాడి కేసులు నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఎహెచ్ఓ ఉపేందర్ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

◆ నిజాంపేట్ మున్సిపల్ పరిధిలో చెత్త కార్మికులుగా పని చేస్తున్న పి.పరమేశ్(40) తిరుపలేష్(28)లు ఎనిమిదేళ్లుగా ఇక్కడ ఇదే వృత్తిలో ఉన్నారు. కాగ ఈనెల 6న రాత్రి సుమారు 11గంటల సమయంలో పరమేశ్, తిరుమలేశ్‌లు ఇద్దరు ప్రగతినగర్ సమీపంలోని రాంకీ రోడ్డులో కృష్ణామాచారి పార్కు వద్ద చెత్త సేకరణ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చెత్త సేకరణ తాము చేస్తున్నామని సుధాకర్ అనే వ్యక్తి తన భార్య శిరీషతో వచ్చి పరమేశ్‌తో గొడవ పడ్డాడు.

◆ దీంతో ఇటుకలతో పరమేశ్ తలపై బలంగా కొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. అడ్డుకునేందుకు వెళ్లిన తిరుమలేశ్‌ను సైతం సుధాకర్, శిరీషలు ఇద్దరు కొట్టారు. స్థానికులు గొడవను గమనించి వారిని నిలువరించారు. అయినప్పటికీ సుధాకర్ తమ బాబాయి మల్లికార్జున్, సోదరుడు దస్తగిరిలకు ఫోన్‌లో గొడవ గురించి చెప్పడంతో వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని అందరు కలిసి పరమేశ్, తిరుమలేశ్‌లపై తిరిగి ఇటుకలతో కత్తితో దాడి చేశారు.

◆ దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108లో ఆసుపత్రికి తరలించారు. పరమేశ్ తలకు సర్జరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. తిరుమలేశ్‌కు సైతం తీవ్ర గాయాలు అయ్యాయని ఇద్దరు కూకట్‌పల్లిలోని ఓ ఆస్పత్రిలో ఐసీయూలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పరమేష్ భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మల్లికార్జున్, సుధాకర్, దస్తగిరి, శిరీషలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చెత్త కార్మికులపై నియంత్రనేది...

◆ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 200 వరకు చెత్త ఆటోలు నడుస్తున్నాయి. ఇక్కడ ప్రతి రోజు 100 టన్నులకు పైగా చెత్తను సేకరిస్తున్నారు. అయితే ఇక్కడ కొంత మంది కార్మిక నాయకులు అని చెప్పుకుని చెత్త ఆటోల నిర్వాహకుల వద్ద డబ్బులు తీసుకుని తమ ఇష్టానూసారంగా తమకు కావాల్సిన వారికి ఆటోలను ఎక్కడంటే అక్కడ పెట్టించడం పరిపాటిగా మారింది. ఆటో కార్మికులు తమకు కేటాయించిన ఏరియాలో కొంత మంది చెత్త సరిగ్గా సేకరించకపోవడంతో అధికారులు ఇతరులకు ఆ ఏరియాను కేటాయిస్తే గతంలో అక్కడ ఉన్న వారు అధికారులను సైతం బ్లాక్ మెయిల్ చేస్తుండటం గమనార్హం.

ఇష్టానుసారంగా డబ్బులు వసూలు....

◆ ఇంటింటి నంచి చెత్త సేకరించే కార్మికుల కాలనీలు, అపార్ట్‌మెంటులు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఇష్టానుసారంగా ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేయడం విశేషం. డబ్బులు ఇస్తేనే చెత్త తీసుకువెళ్తాం లేకుంటే లేదు అని డిమాండ్ చేసే స్థాయికి నిజాంపేట్‌లో చెత్త సేకరించే కొంత మంది వ్యవహారించడం పట్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

చెత్త కార్మికులను నియంత్రించాలి....

◆ కార్పొరేషన్‌లో చెత్త సేకరించే కార్మికులను అధికారులు నియంత్రించాల్సిన అవసరం ఎంతైన ఉందని స్థానికులు కోరుతున్నారు. అధికారుల అదేశాలను సైతం బేఖాతరు చేయడం ఏమిటని ప్రజలే ముక్కున వేలేసుకుంటున్నారు. ఆటో కార్మికుల విధి నిర్వహణ, ప్రవర్తన తదితర అంశాలను పూర్తి స్థాయిలో పరిగణలోకి తీసుకుని అవసరమైన గుర్తింపు కార్డులు ఇచ్చి అధికారుల నిబంధనల ప్రకారం కేటాయించిన ఏరియాలోకి మరోకరు వెళ్లాకుండా సరైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కలుషిత నీటి సరఫరాతో తిప్పలు



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని బూరుగుబావి గండయ్యకాలనీలో గత కొన్ని రోజులుగా కలుషిత జలాలు సరఫరా అవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు వెడల్పులో భాగంగా డ్రైనేజీ మార్గం ధ్వంసం కావడంతో మురుగునీరు మంజీర పైపులో వచ్చి చేరడం వలన ఈ సమస్య తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

శిల్పారామంలో ముగిసిన మేళా

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కనకదుర్గ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఇందులో తనన, జయవారలక్ష్మి, శివపంచాక్షరీ, నర్తన గణపతిం,అర్ధనారీశ్వరం తదితర అంశాలను కళాకారులు మనస్విని, తేజస్వినీ, నిత్య, రిషిక, అనన్య, పర్ణిక, దన్విక, అంజలి, అర్జున్, నాగరమ్య తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్‌చేయవచ్చు.

అనుమతి లేకుండా ప్రవేశాలు చేపడుతున్న స్కూల్ సీజ్

కుత్బుల్లాపూర్: ఎలాంటి అనుమతులు లేకుండా ప్రవేశాలు తీసుకుంటున్న పాఠశాలను విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. సుచిత్రలో శ్రీచైతన్య హైస్కూల్ నూతన బ్రాంచ్‌కి ఎలాంటి అనుమతులు లేవు. దీనికి తోడు పాఠశాలకు ఎదురుగా బోర్డును ఏర్పాటు చేసి వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు తీసుకుంటున్నారు. దీనిపై సమాచారం అందుకున్న మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు, మండల రిసోర్స్ పర్సన్ రమేశ్ లు నోటీసులు అందజేసి సీజ్ చేశారు. అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని, పాఠశాల్లో అడ్మిషన్లు తీసుకునే సమయంలో పాఠశాలలకు సంబంధించి పూర్తి వివరాలు తల్లిదండ్రులు తెలుసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.



సుచిత్రలోని శ్రీచైతన్య హైస్కూల్‌ను సీజ్ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

రోడ్లపై వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం



రంగ భుజంగ థియేటర్ సమీపంలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగిస్తున్న దృశ్యం



అక్రమలను తొలగింపును పర్యవేక్షిస్తున్న బాలానగర్ ఏసీపీ శ్రీనివాసులు

బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

సుభాష్‌నగర్: వాహనదారుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరడమే తమ లక్ష్యం అని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డు ఫుట్‌పాత్‌లపై వెలసిన షాపులపై ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌ఫోర్టులు సంయుక్తంగా గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. షాపూర్‌నగర్‌లోని రంగ భుజంగ థియేటర్ వద్ద వాహన రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ప్రధాన రోడ్డును అనుకొని ఫుట్‌పాత్‌పై వెలిసిన డబ్బాలు, నిర్మాణాలపై కొరడా ఝులిపించారు. రోడ్డును ఆనుకొని ఉన్న డబ్బాలను చిరు దుకాణాలను తొలగించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలోని ప్రధాన రోడ్లపై వెలసిన నిర్మాణాలను దశలవారీగా తొలగిస్తామని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ యాక్షన్ హీరోగా సింగం మహేశ



ప్రముఖ ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్‌లు నటుడు సింగం మహేశ్‌ను అభినందించారు. 'ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్'(ఐఎఫ్ఎంఏ) ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతి మహతి ఆడిటోరియంలో అవార్డులు ప్రదానోత్సవం జరిగింది. చేశారు. 2020 నుంచి 2024 జనవరి వరకూ విడుదలైన సినిమాల్లో ఉత్తమ సినిమాలు, వివిధ విభాగాలకు అవార్డులను అందించారు. ఇందులో భాగంగా '302'సినిమాకు బెస్ట్ యాక్షన్ హీరోగా సింగం మహేశ్‌కి అవార్డు దక్కింది. శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి పీఠాధిపతులు మూర్తి స్వామి చేతులమీదుగా మహేశ్ అవార్డు అందుకున్నారు. యాక్షన్ హీరో అవార్డు అందుకున్న సింగం మహేశ్‌ను రామ్, లక్ష్మణ్ మాస్టర్స్ అభినందించి, భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. – సాక్షి, సిటీబ్యూరో

భద్రం.. లేకుంటే బతుకు ఛిద్రం!





షాపూర్‌నగర్ చౌరస్తా వద్ద సిగ్నల్స్

రంగారెడ్డినగర్: షాపూర్‌నగర్ చౌరస్తా రాంగ్ రూట్ డ్రైవింగ్‌లకు అడ్డాగా మారింది. త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే అదృతతో కొందరు ద్విచక్ర వాహనదారులు రోడ్డుకు సమాంతరంగా ఉన్న డివైడర్లను దాటి అవతలి వైపుకు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో ఉన్న షాపూర్‌నగర్ చౌరస్తాలో కొందరు ద్విచక్ర వాహనదారుల రాంగ్ రూట్ డ్రైవింగ్‌తో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి రాకపోవడంతో పాదాచారులు సైతం ఇక్కడే రోడ్డు దాటుతున్నారు. షాపూర్‌నగర్ సిగ్నల్స్ కొద్ది దూరంలోనే ఉన్నా ద్విచక్ర వాహనదారులు అక్కడ నుంచి యూటర్న్ తీసుకోకుండా అడ్డదారిలో వెళ్లడం గమనార్హం. ఈ ప్రాంతంలో డివైడర్ల ఎత్తు పెంచితే రాంగ్‌రూట్ రాకపోకలను ఆరికట్టవచ్చు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసు అధికారులు ఈ రాంగ్ రూట్ డ్రైవింగ్‌లకు అడ్డుకట్ట వేస్తారో.. లేదో వేచి చూడాలి..



షాపూర్‌నగర్ చౌరస్తాలో రాంగ్ రూట్‌లో డివైడర్లను దాటుతున్న ద్విచక్ర వాహనదారులు

శివసాయిక్షేత్రంలో రుద్రాభిషేకం

రాయదుర్గం: మాసశివరాత్రిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం ఆలయంలో కాశీ విశ్వేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ప్రత్యేకంగా అర్చకుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని అన్నపూర్ణాదేవికి, గణేషుడికి, షిర్డీసాయిబాబాకు, ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలుచేసి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

చందానగర్ డివిజన్ అభివృద్ధికి కృషి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిఫెన్స్ కాలనీలో సుమారు రూ.25 లక్షల నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వరలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమ నిర్మాణాల తొలగింపు

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువులో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఇటీవల కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి గంగారం పెద్ద చెరువులో ఆక్రమణను తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది కఠినంగా వ్యవహరించి చెరువులోని అక్రమణ నిర్మాణాలను పూర్తిగా తొలగించాలన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 6 గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకాల కింద లబ్దిదారుల దరఖాస్తుల పరిశీలన గురువారం చందానగర్ సర్కిల్ 21 పరిధిలో ప్రారంభం అయ్యిందని ఉపకమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ సర్కిల్ పరిధిలో నాలుగు డివిజన్లు ఉండగా మాదాపూర్ డివిజన్‌లో 1495, మియాపూర్ డివిజన్‌లో 1674, హఫీజ్‌పేట్ డివిజన్‌లో 2341, చందానగర్ డివిజన్‌లో 1448 మొత్తం 6958 దరఖాస్తులు వచ్చాయన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రజాపాలన మొబైల్ యాప్‌లో పొందు పరిచే విధంగా యూసీడీ విభాగానికి చెందిన సిబ్బంది, బిల్ కలెక్టర్, ఎస్ఆర్పీ, ఎస్ఎఫ్ఏలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రజాపాలన దరఖాస్తులలో పొందు పరిచిన వివరాలను గ్యాస్ కనెక్షన్ నంబరును పరిశీలించి మొబైల్ యాప్‌లో పొందుపర్చాలన్నారు. ఈ దరఖాస్తులు శనివారం వరకు పరిశీలన పూర్తి అవుతుందని ఆయన తెలిపారు.

ఘనంగా బీసీసీ మినిస్ట్రీస్ వార్షికోత్సవం

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లిలోని బీసీసీ మినిస్ట్రీస్ వార్షికోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు కనుల పండుగగా జరిగాయి. ఈ సందర్భంగా భగవంతుడికి పూర్తి విధేయత చూడనమే దీనికి ఏకైక పరిష్కారమని ప్రముఖ సువార్తీకులు రెవరెండ్ డాక్టర్ డేవిడ్ ప్రశాంత్ గొల్లపల్లి తెలిపారు. విధేయత పేరుతో మరో నాలుగు రకాల విధేయతలు ప్రత్యక్షమవుతుంటాయని డాక్టర్ డేవిడ్ గొల్లపల్లి వివరించారు. ప్రసిద్ధి విధేయత, పాక్షిక విదేయత, ప్రేక్షక విధేయత, ప్రేరిత విధేయత అనే ఉచ్చుల్లో చిక్కుకోకుండా విధాతకు పూర్తి విధేయత చూపాలని సూచించారు. దేవుడు కనిపించి మాట్లాడాడు అంటూ.. తప్పుగా ప్రచారం చేస్తుంటారని ఇదంతా తప్పని తేల్చి చెప్పారు. క్రిస్టియన్ సమాజంలో నో అని చెప్పాల్సి వచ్చినప్పుడు, ప్రార్థన చేసి చెబుతామని అంటుంటారని డాక్టర్ గొల్లపల్లి చెణుకులు విసిరారు. ఈ కార్యక్రమంలో బీసీసీ సంఘ పెద్దలో హనోక్ ఆర్థర్, రత్నమయ్య, సతీష్ మంద్రు, క్వయర్ టీమ్ బాధ్యులు పాస్టర్ జాలీ సామ్, హోలీ యూత్ టీమ్ డైరెక్టర్ జిన్నీ సామ్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి బీసీసీ మినిస్ట్రీస్ అధ్యక్షుడు, సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ విప్పర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హోలి యూత్ టీమ్ ప్రదర్శించిన డ్యాన్సులు, స్పెషల్ సాంగ్స్ ఆహుతులను ఎంతగానో అలరించాయి.

మేడ్చల్ జిల్లాలో 28,75,907 మంది ఓటర్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: సవరించిన తుది ఓటరు జాబితాపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం డీఆర్ఓ హరిప్రియతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2024 ప్రకారం నమోదులు, తొలగింపుల అనంతరం జిల్లాలో సవరించిన ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. జిల్లాలో 28,75,907 మంది ఓటర్లుగా నమోదయ్యారని ఆయన తెలిపారు. 10,264 మంది యువత కొత్తగా ఓటర్ జాబితాలో చేరినట్లు తెలిపారు. ఇందులో సర్వీస్ ఓటర్లు 715 మంది, దివ్యాంగులు, 26,207, పురుషులు 1,48,3448 మంది, మహిళలు 13,92,074 మంది, ట్రాన్స్‌జెండర్ 385 మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. 80 సంవత్సరాల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకుంటే వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటివద్దే ఓటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించాలని పార్టీ ప్రతినిధులు కోరగా, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం తొలగించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఫస్ట్ లెవెల్ చెకింగ్‌లో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్, బ్యాలెట్ బాక్స్ పనితీరును అదనపు కలెక్టర్‌తో కలిసి రాజకీయ పార్టీ ప్రతినిధులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్రెడ్డి, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి..!

సాక్షి, మేడ్చల్ జిల్లా: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి 1.71 లక్షల పనిదినాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి సంబంధించి రూ.5.30 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించారు. అయితే ప్రతిపాదించిన వాటిని కేంద్రానికి పంపించగా.. వారు అందులో ఎన్ని రోజులకు కుదిస్తారో తెలియాల్సింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా 17,832 జాబ్ కార్డులు ఉన్నాయి. 61 పంచాయతీల్లో ఇటీవలే గ్రామసభలు పూర్తి చేశారు. కూలీల నుంచి వచ్చే డిమాండ్ ఆధారంగా పనుల గుర్తింపు ప్రక్రియ కొనసాగింది. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ కింద ఎక్కువగా హరితహారం, ఇంకుడు గుంతలు, రైతు కల్లాలు, బృహత్ ప్రకృతి వనాలు, చెరువుల్లో పూడికతీత తదితర పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. చాలా గ్రామాల్లో కూలీలు, రైతులు వీటికి సంబంధించే పనులు అడిగారు. మౌలిక సదుపాయాల కింద వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, వినియోగంలో లేని రోడ్లు బాగుచేయడం, పాడుబడిన బావులు పూడ్చివేత, హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం కోసం గుంతలు తీయడం, కంచెల నిర్మాణం, మొక్కలకు నీరు పోసే పనులు నిరంతరం కొనసాగించాలని అత్యధికులు తీర్మానించినట్లు తెలుస్తోంది.